చీకటి నిష్క్రమణకి సూచనగా చెట్ల గుబురుల్లోంచి పక్షుల కిలకిలా రావాలు ప్రారంభమయ్యాయి.

క్రమంగా వాకిళ్ళు వూడ్చి, కళ్ళాపి జల్లుతోన్న ధ్వనులు. పొలాలకి అరకలు వెళుతోన్న చప్పుడు, పాలేరు గొడ్ల చావడిలో పశువుల్ని అదలిస్తూ వేస్తున్న కేకలు, పాలు పితుకుతున్నప్పుడు చెంబు నిండుతోన్న వినికిడి అన్నీ మంచమ్మీదనుండి కదలకుండా వింటూనే వున్నాడు ధర్మరాజు.

కాని కదిలి లేవాలనిపించడం లేదు.

రోజూ ఈపాటికి ఇంటికి అర మైలు దూరం ఉన్న కాలవదాకా చుట్ట కాలుస్తూనడిచెళ్ళివొచ్చేవాడు. అప్పుడు తెల్లవారేది! అతను రాగానే అతని భార్య శకుంతల చెంబంత గ్లాసుతో అతనికి కాఫీ అందించేది. అది తాగుతూ అప్పుడే వచ్చిన తెలుగు పేపర్ క్షుణ్ణంగా చదివేవాడతను.

కాని.......ఈ రోజు ....తెల్లవారితే ఏం చూడాల్సివస్తుందోనని భయం.

మంచం మీద నుంచి లేస్తే ఏం జరుగుతుందోనని కంగారు.

కాని.... అతను లేవలేదని తెల్లవారడం ఆగలేదు

ఆరోగ్యమైన పాపాయిలా సూర్యుడు ఆకాశంలోకి దోగాడటం ప్రారంభించేడు

తూర్పుకి అభిముఖంగా వున్న ఆ మేడ ముందరి భాగమంతా వెలుగుతో నిండిపోయి మెరిసిపోతూ వుంటే, ఆ మేడ అంతర్భాగంలో అలవికాని చీకట్లు ముసురుకుంటున్నాయి.



# మన్నెంశారద

## 'ఇదీప్రశ్న - ఏది జవాబు?'

ధర్మరాజు ధర్మపత్ని శకుంతల ఆవతల గదిలో శవంలా కూర్చుని కుమిలిపోతున్నది. అతనికి ఎదురు వేపు చావడికి అనుకున్న గదిలో మంచంమ్మీద బోర్లా పడుకుని వెక్కెక్కి ఏడుస్తోంది అతని కోడలు నర్మద.

ఆ తెల్లవార్లూ ఆమె వర్షాకాలపు నర్మదానదే అయి పొంగిపొర్లింది అయినా ఎక్కడ నుండి వస్తుందో పాడు దుఃఖం. ఆమె నరనరాల్ని కోసేస్తూ రక్తాన్ని నీరుగా మార్చి కళ్ళలోంచి వుబికి బయట పడుతోంది విపరీతంగా ఏడ్వటం వలన ఆమె ముహం పొంగిపోయింది కళ్ళు మందారాల్లా ఎర్రబడి పోయున్నాయి.

ఒకరిని ఒకరు ఊరడించుకో లేని స్థితిలో ప్రాణమున్న శవాల్లా ఎవరి స్థానాల్లో వాళ్ళు అతుక్కుపోయేరు.

పిండిన పాల చెంబుని వంటమనిషి గౌరమ్మ కందిస్తూ "ఇంట్లో అందరూ ఊరెల్లేరా?" అన్నాడు పాలేరు నీలయ్య.

"ష్" అంది గౌరమ్మ మెల్లిగా అన్నట్లు సైగ చేస్తూ. వాడు బుర్ర గీక్కుంటూ "ఏంటీ కత?" అన్నాడు అయోమయంగా చూస్తూ.

"కతే మరి అందరూ లోనే వున్నారు. ఏటి జరిగిందో తెలవదుగాని అందరూ ఘుంచాల మీద కూడా బలుక్కున్నట్టు సెలుక్కుపోయేరు." అంది గుసగుసగా.

"పెద్దయ్య కూడానా?"

"ఆ. కొడుకు మొన్న వూరెల్లిన దగ్గర్నుండీ యింతే! ఏంటో మరి" అంది గౌరమ్మ.

"సిత్రంగా వుందే." నీలయ్య గొణుక్కుంటూ ముందు వేపుకి వెళ్ళేడు.

"ధర్మరాజు లేవలేదంట్రా?" ఊరి పెద్దగా చలామణి అవుతున్న భావరాజు మరో నలుగుర్ని వెంటేసుకుని వచ్చేడు.

"లేదు బాబూ." అన్నాడు నీలయ్య వినయంగా. భావరాజు తనతో పాటూ వచ్చిన పెద్ద మనుషుల ముహాలకేసి చూసేడు.

"ఎట్టా లేస్తాడులే ఇంతగోరం యిని అయినా ఆ సాగర్ గాడి కింత బుద్ది లేకుండా పోయింది. ఇంత పెద్ద సదువు సదివి యిట్టాటి ఎదవ పని సేస్తాడా?" అన్నాడు అందులో ఒకతను.

"స్. ఆడొచ్చే టయిమయింది అందరూ ఆణ్ణి సూడగానే రోడ్డు పక్కన ఊరకుక్కల్లా నాలికెల్లబెట్టి సొంగ కార్చకుండా గట్టిగా నిలెయ్యండి. నే సెప్పిన సంగతులు గార్తున్నాయిగా! ఆడు సదూకున్నోడని, పెద్ద నౌకరీ ఎలగబెడ్తున్నాడని బెదరి సావకండి మన కల్లెదుట చెడ్డి తొడుక్కున్న ఎదవ ఎట్టాగయినా ఆ పిల్ల సంసారం నిలబెట్టాల." అంటూ మరోసారి హెచ్చరించేడు భావరాజు.

వాళ్ళు అలాగే నంటూ తలలూపేరు.

వాళ్ళందర్నీ హాల్లో వున్న బెంచీలమీద కూర్చోబెట్టి లోపలికి నడిచేడు భావరాజు

ధర్మరాజు కళ్ళు తెరచే పడుకుని వున్నాడు. అయినా తన గదిలోకి నడిచి వస్తున్న భావరాజుని చూసి ఏ భావమూ ప్రకటించలేకపోయేడతను.

"బావా?" అంటూ అనునయంగా పిలుస్తూ మంచం దగ్గరగా వెళ్ళేడు భావరాజు.

ఆ పిలుపుకు గాలి తగిలిన గాఢమయిన మేఘం కదిలి కరిగి వర్షించినట్లుగా అతని కళ్ళనుండి కన్నీళ్ళు జారడం ప్రారంభించాయి.

"స' ఊరుకో బావా, ఏం జరిగిందని?" అన్నాడు భావరాజు ఊరడిస్తున్నట్లుగా.

"ఆడు...ఆడింత పని సేస్తాడనుకోలేదు. ఎంత కష్టపడి సదివించేనని" అన్నాడు బాధతో లుంగ చుట్టుకుపోయిన హృదయంతో.

"ఇంత సిన్న సంగతికే ఇలా బెంబేలుపడిపోతే ఎట్లా?ఏదో సిన్నతనం! తెలవక ఎర్రి ఏసాలేస్తే మనం సర్దుబాటు సేసుకోవాలి" అన్నాడు భావరాజు.

"ఎట్టా సర్దుకోవటం?ఆ పిల్లకి ఏం తక్కువైపోయిందని ఇంత ఎదవ పని సేసేడు? లక్షల కట్నం, పెణుగుల బంగారం తెచ్చింది. రేపీ సంగతి ఆడి అత్తగారింట్లో తెలిసిపోయిందంటే ఎంత నామర్దా. ఆడి మావగారి పలుకుబడి నీకు తెల్సుగా? హయిద్రాబాదుకి ఒక ఫోను కొట్టి ఈడ్జి ఉద్జోగం వూడగొట్టి కటకటాల మజైన కూర్చోబెట్టగలడు" అన్నాడు ధర్మరాజు ఆవేదనగా.

భావరాజు నాలిక తేలిగ్గా ఆడించి "ఆదంత తేలిగ్గాడు గాని.... ముందు నువ్వు లేచి కాసింత కాపీ తాగు. ఆడ్జెట్టా నిలెయ్యాలో నాకొదిలేయ్." అని వెనక్కి తిరిగి 'సెల్లెమ్మా' అంటూ పిలిచేడు.

మరో పదినిముషాలకి మెల్లిగా కదిలి గుమ్మంలో కొచ్చి నిలబడింది శకుంతల.

ఆవిడ పీక్కుపోయిన ముహం చూసి "అయ్యో, నువ్వు యిలానే కూసున్నావా అసలేం జరిగిపోయిందని ఆడు ఏదో తెలీక తెలివి తక్కువ ఏసం కడితే మనం బాజా వాయిస్తామా? ఆణ్ణి కడిగెయ్యమూ. ముందు నువ్వెల్లి బావగారికి కాఫీ అట్టుకురా! మేం యవ్వారం మాట్టాడుకుంటుంటాం." అని శకుంతలని ఊదరగొట్టి వకట గదిలోకి పంపించేడు భావరాజు.

* * *

"అసలింతకీ ఏంటుందా వుత్తరంలో." కాఫీ తాగి గ్లాసు పక్కకి పెడ్తూ అడిగేడు భావరాజు.

ధర్మరాజు క్షణం మౌనం వహించి "నాకూ తెలవదు. కోడలు పిల్ల చెవ్పటమే. కదిలిస్తే ఏడుస్తుంది గాని ఏ సంగతీ సరిగ్గా యివరంగా సెప్పటం లేదు." అన్నాడు.

గుమ్మం వారగా తలుపు కానుకుని నిలబడ్డ శకుంతలమ్మకేసి చూశాడు భావరాజు.

ఎన్నో లంఖణాలు చేసినట్లుందావిడ ముఖం.

కదిలిస్తే కుంభవృష్టి కురిసేటున్న వాళ్ళని ఏమడగటానికీ తోచటంలేదు.

కానీ తప్పదు.

మరో గంటో అర గంటలోనో మద్రాస్ ఎక్స్‌ప్రెస్‌కి సాగర్ వచ్చేస్తాడు. సంగతి సరిగ్గా తెలియకుండానే ఏమిటి నిలెయ్య

దం?

"సెల్లెమ్మా!"

శకుంతలమ్మ కళ్ళెత్తి చూసింద.

"ఇలా బాధపడ్తా కూసుంటే పనులెట్లా సాగుతాయమ్మా? నువ్వెల్లి ఆ కోడలు పిల్లని ఆ ఉత్తరం ఆట్టుకుని రమ్మను. అందులో ఏంటుందో తెలవకుండా.... ఏటడుగుతాం అణ్ణి?" అన్నాడు భావరాజు.

శకుంతలమ్మ భారంగా లోపలికి కదలింది.

నర్మద కప్పుకేసి నిర్లింగా చూస్తూ ఆలోచిస్తోంది! ఆమెలోని దుఃఖోద్వేగం కొద్దిగా తగ్గింది.

మరికొన్ని నిముషాల్లో భర్త వచ్చేస్తాడు!

తనేం చెయ్యాలి?

అతను చెప్పినట్లుగా అతనికి అతని కొడుక్కి స్వాగతం పలకటమా?

అతని పురుషాధిక్యతకి తల ఒగ్గడమా?

"మంచి పేరు కోసం ఆత్మాభిమానాన్ని అతని కాళ్ళకి చెప్పులుగా తొడిగి కుక్కిన పేనులా పడుంటమా?

తిరిగి అమె కళ్ళకి గండి పడింది.

అసలు.... అసలిదంతా ఆ ఆ ఉత్తరమే చేసింది.

సాగర్ తనని ఎంత ప్రేమగా, ఆదరణగా, గౌరవంగా చూసేవాడు! అతనికి స్త్రీల పట్ల నీచ భావం లేదు. వాళ్ళు మగవాడికన్నా తక్కువ రకం జాతి అనే దృష్టితో, ఎప్పుడూ చూడ లేదు.

అతనికి ఐ.ఎ.ఎస్ సెలక్షన్ వచ్చి ట్రయినింగ్‌లో వున్నప్పుడూ కూడ తనకి ఎంత ప్రేమగా, లాలిత్యంగా ఉత్తరాలు రాసేవాడు. ఎంతో ఉదాత్తమైన భావాలు అతనివి.

కాని....అంతా జరిగిపోయింది.

నిజానికి ఇక వారం రోజుల్లో తాము అతన్ని జాయింట్ కలెక్టరుగా పోస్ట్ చేసిన కాకినాడకు వెళ్ళిపోవాలి.

కాని ఇంతలో సంధించి వదలిన శరంలా ఆ ఉత్తరం తమ ఇంట్లోకి ప్రవేశించింద.

ఆ రోజు ఏ శితువు తమ ఇంటిపైన ఆర్తనాదం చేసుకుంటూ ఎగిరిపోయిందో, ఏ గుడ్ల గూబ తమ వంక తేరపార చూసిందో, ఏ గబ్బిలం తమ ఇంట్లో వీర విహారం చేసిందో....ఆ దారుణ నిజం తనకి తెలిసిపోయింది.

అతనికి వచ్చిన ఉత్తరాల్లో అదొకటి.

అన్నీ అతని టేబుల్ మీద పెట్టింది.

అంత సేపూ తనతో ఎంతో ప్రేమగా ఉన్న అతను ఆ ఉత్తరం చదవగానే అదోలా అయిపోయాడు. చాలాసేపు నిర్వేదనగా ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు.

"ఏం జరిగింది? ఎందుకలా ఉన్నారు?" తను ఆత్రుతగా అతన్ని కుదిపి అడిగింది.

అతను బదులుగా ఆ ఉత్తరాన్ని తన చేతికిచ్చేడు చదవమన్నట్లుగా. తను గబగబా ఆ మాటల్ని చదివింది.

డియర్ సాగర్,

నన్ను అస్సాం పోస్టు చేశేరు. నిన్ను ఆంధ్రాలోనే వేసేరని తెలిసింది. నువ్వు లక్కీ. నీకో ముఖ్యమైన సంగతి. నాకెలా చెప్పాలో తెలియడం లేదు. మనకి... అంటే నాకో బాబు పుట్టేడు. ఆశ్చర్యపోకు. నేను కూడ ఇలా జరుగుతుందను కోలేదు. మనం విడిపోయేటప్పుడు చేసిన ఒక చిన్న పొరబాటు... ఇంతకి దారి తీస్తుందని. ఇంట్లో గొడవ మామూలే! సంఘం అంటే నాకు భయం. వణుకు ఎక్స్‌ట్రా ఏపీలేవు గాని....ఎబార్షన్ టైము దాటిపోయింది. అమ్మ చాల పాతకాలం మనిషి. నా మూలంగా వెనక వాళ్ళ భవిష్యత్తులు నాశనమై పోతాయంటే బాబుని అనాధాశ్రమానికి యివ్వడానికి ఒప్పుకున్నాను. కాని తీరా వాణ్ణి చూస్తే.... మాతృప్రేమ ఉడికి పోతుందని అనను కాని...., అంత అందంగా వున్న వాణ్ణి నువ్వూ....నేను వుండి కూడ దిక్కు లేకుండా చేయడం ఎందుకో బాగా అనిపించలేదు. అవివాహిత తల్లిగా వాణ్ణి పెంచడం నాకెంత సమస్యో నీకు తెలుసు. పైగా నా ఆశయాలకి ఈ రకమైన ఎటాచ్‌మెంట్సు కుదరవు. అంతా నీకు తెలుసు! సామాజిక బలమున్న పురుషుడివి నువ్వు! ఏ తప్పు చేస్తే మగవాడికి రసికుడు, శృంగార పురుషుడని బిరుదులిచ్చి గౌరవించే సంఘం ఆడదాన్ని తరిమి తరిమి కొడుతుంది! నాకు తెలిసినంత వరకూ వాడు నీ మొదటి సంతానం! యామై కరెక్ట్? అందుకే వాణ్ణి నువ్వెందుకు స్వీకరించకూడదూ నీ ఆస్తికి ఎర వెయ్యడానికో, నీ జీవితంలో ఆ విధంగా నేను చోటు చేసుకో డానికో నేనిలా నాటకం ఆడుతున్నానని నువ్వు అనుకోక పోతే.... వెంటనే బయల్దేరి వచ్చి వాణ్ణి తీసుకెళ్ళు. నేను ఈ రోజే అస్సాం బయల్దేరి వెళ్ళి పోతున్నాను. అమ్మకి చెప్పేను నువ్వు వస్తే.... బాబుని అప్పచెప్పమని. లేకపోతే వాడి బాడ్‌లక్. వారం తర్వాత ఆర్షనేజ్‌కి అప్పజెప్పేస్తారు.

ఫ్రెండ్లీ యువర్స్,
–మృణాలిని.

ఆ ఉత్తరం తనేకి అర్థమయీ, అర్థమవనట్లు... నిజంగా ....అర్థం కాకనేనా...?

"ఏంటిది?"

అతను తన వంక అదోలా చూసి "జరిగింది జరిగినట్లు చెబుతాను. దాన్నొక కథలా మలిచి నన్ను ఒడ్డున వేసుకునే ప్రయత్నం చేయను. నేను తప్పు చేశాను. ఆమె కలకత్తానుండి ట్రెయినింగ్‌కి వచ్చింది. చాలా సోషల్‌గా మూవ్ అయ్యేది. ఒక రోజు హద్దు దాటాం. దాని పర్యవసమే ఇదంతా."

అతను తన వెక్కిళ్ళు విని చెప్పడం ఆపేశాడు.

అర్థరాత్రి దాటింది. అతను కూర్చునే ఉన్నాడు. తను ఏడుస్తూనే ఉంది.

తెలతెలవారుతుండగా అతను సూట్‌కేసు సర్దుకుంటూ అన్నాడు– "బాబుని తీసుకురావడానికి వెళ్తున్నాను" అని.

తనలోని ఆవేదన ఆవేశంగా మారింది.

"నేను....నేను....నా పుట్టింటికి వెళ్ళిపోతాను. తర్వాత మీ ఇష్టం వచ్చేట్లు చేసుకోండి."

అతను అదోలా నవ్వి "దాని వల్ల ఎలాంటి ప్రయోజనమూ వుండదు నర్మదా. ఆ పసివాడు నీకే విధంగా అడ్డొస్తాడో ఆలోచించు" అన్నాడు అనునయంగా.

నర్మదలో దుఃఖం ఉప్పొంగింది.

"వాడు నా కొడుకు కాదు ప్రేమించడానికి!"

"స్వంత బిడ్డని ప్రేమించడం స్వార్థమవుతుంది. పరుల పిల్లల్ని లాలించడంలోనే స్త్రీ ఔన్నత్యం ప్రస్ఫుటమయ్యేది. నేను తప్పు చేశానని ఒప్పుకుంటున్నాను. వాడు పుట్టకపోతే ఈ తప్పు నీకు




ఇంకా ఏం కూర చేయమంటావ్ అది ముగుస్తోందే.. ఈ రోజుకి ఆ ఉగాది పచ్చడే !!

తెలిసే అవకాశమే లేదు. అప్పుడు నువ్వు నన్ను శ్రీరామచంద్రుడిగా భావించి ఉండేదానివి" అన్నాడు అతను.

తనకి ఏం చేయాలో తోచ లేదు.

"వాణ్ణి ఇంటికి తెస్తే మనింటి పరువు పోదూ? మామ గారు ఊరుకుంటారా?" అంది సంశయంగా.

అతనికి ధైర్యం వచ్చింది. "నాకు కావాల్సింది నీ సహకారం. నువ్వు వాడిని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తే...." అంటూ తనని కౌగిట్లోకి తీసుకున్నాడు.

తన మౌనాన్ని అంగీకారంగా తీసుకుని అతనెళ్ళిపోతుంటే నిస్సహాయంగా చూసింది తను.

"నర్మదా."

అత్తగారి పిలుపు విని ఆలోచనల్లోంచి బయటపడింది.

"ఒక్కసారి ఆ ఉత్తరం తీసుకుని నిన్ను రమ్మంటున్నారమ్మా" అంది.

నర్మద పైకి లేచింది.

బయట కారాగిన చప్పుడు.

అందరి గుండెల్లో దడ దడ!

* * *

నర్మద కళ్ళు పెద్దవి చేసి కారు దిగుతున్న భర్తకేసి చూసింది.

అతను గేట్లోకి వచ్చేడు. అతని చేతుల్లో పొత్తిళ్ళ మధ్య కాళ్ళూ చేతులూ ఆడిస్తున్న రోజుల బిడ్డ!

గుండె గబుక్కున జారినట్లయింది!

హాల్లో బెంచీమీద కూర్చున్న పెద్ద మనుష్యులు చోద్యంగా చూస్తున్నారు. శకుంతలమ్మ తల భూమిలోకి కుంగిపోయింది.

"ఈడు నిజంగానే తీసుకొచ్చినట్టున్నాడే!" అన్నాడు భావరాజు ధర్మరాజుకేసి చూస్తూ.

ధర్మరాజు కోపంతో మండిపోయేడు.

"ఆగు!" అన్నాడు ఘర్జిస్తుట్లుగా.

మెట్టు మీద కాలు మోపబోతున్నవాడల్లా ఆగిపోయి తండ్రి వైపు చూసేడు విద్యాసాగర్!

"ఛీ! నువ్వింత నీచానికి దిగజారి పోతావనుకోలేదురా. ఒక బజారుదాని కొడుకుని 'నా' కొడుకని యింటికి తీసుకొచ్చేవంటే నువ్వెంత వాజమ్మవో అర్థమవుతోంది" అన్నాడు ధర్మరాజు ఆవేశంగా.

"నీకు బొత్తిగా దాని రాజకీయం అర్థం కాలేదురా అబ్బాయీ ఆస్తి కోసం అది బిడ్డని కంది. నువ్వు మా లాంటి పెద్దల సలహా అడక్కుండా చెవులూపుకుంటూ ఎళ్ళేవు." అన్నాడు భావరాజు.

విద్యాసాగర్ గుమ్మం దగ్గర నిలబడ్డ భార్యవైపు చూసి "ముందు వీణ్ణి అందుకో." అన్నాడు.

నర్మద అత్తగారి వైపు చూసింది.

అత్తగారు భర్త వైపు చూసింది.

"వాణ్ణి ఇంట్లోకి తీసుకురావడానికి వీల్లేదు. అలగా వెధవలకి ఆశ్రయమివ్వడానికి నేనీ కొంప కట్టలేదు" అన్నాడు ధర్మరాజు ఉగ్రుడవుతూ.

"అంటే నేను కూడ...." విద్యాసాగర్ మెట్టు మీద కాలు వేస్తూ అడిగేడు.

"వాడితో ఈ యింట్లో నిన్ను అడుగు పెట్టనివ్వను. ఒక వ్యభిచారి కొడుక్కి యిక్కడ ఆశ్రయం లేదు."

విద్యాసాగర్ తండ్రి వైపు చురుగ్గా చూసి "ఒక అపరిచిత స్త్రీ గురించి మీరు నోరు జారెయ్యడం మంచిది కాదు. ఆమె చేసిన తప్పులో నాకూ భాగముంది ఎవరు వేసిన అడుగుల్లోనో జాగ్రత్తగా నడిచే పిరికి వాళ్ళకి ఆమె ధైర్యం, ఖచ్చితంగా నిజాన్ని చెప్పగల ధైర్యం బరి తెగించినట్లే కన్పించవచ్చు. కాని ఆమె వ్యభిచారి కాదు. అన్నాడు.

"ఇంకేం దానితోనే ఊరేగు." అన్నాడు ధర్మరాజు చేతులు తిప్పుతూ.

"అది అప్రస్తుతమైన విషయం! నేను నా కొడుకుతో లోపలికి రావొచ్చా?" విద్యాసాగర్ సూటిగా అడిగేడు.

భావరాజు ముందుకొచ్చి "చిన్నపిల్లాడిలా ఏట్రా అబ్బాయ్ యిదంతా అవతల ఆపిల్ల ఎంత కుమిలి పోతుంది. ఎవత్తో కన్న బిడ్డని మరో ఆడది ఎట్లా పెంచుతుంది?" అన్నాడు.

విద్యాసాగర్ మెట్లుదిగి "సరే, నా కొడుక్కి స్థానం లేని చోట నాకూ లేదు. నువ్వు నాతో వస్తావా నర్మదా?" భార్యకేసి సూటిగా చూస్తూ అడిగేడు.

నర్మద తటపటాయింపుగా మామగారివైపు చూసింది.

"ఏ ముహం పెట్టుకుని ఆ పిల్లని నీతో రమ్మని అడుగుతున్నావురా ఆ పిల్లకిక నీ లాంటి దౌర్భాగ్యుడితో కాపురం చెయ్యాల్సిన ఖర్మ లేదు." అన్నాడు ధర్మరాజు ఏవగింపుగా ముహం తిప్పుకుని.

విద్యాసాగర్ తండ్రి వైపు చూసి అదోలా నవ్వి "మరి అమ్మ?" అన్నాడు.

"అంటే.... అంటే?" ఆవేశంతో చెయ్యెత్తేడు ధర్మరాజు.

తీర్పు చెప్పడానికి వచ్చిన పెద్దలంతా విస్తుపోయి చూసేరా సంఘటన్ని.

"మీరూరికే ఆవేశ పడకండి. కడుపుని పుట్టిన బిడ్డనే ఒక గొడ్ల కాపరిగా యింట్లో పెట్టుకొని ఊడిగం చేయించుకోగల ఔదార్యం మీకుండొచ్చు. కాని నాకు లేదు."

అతని మాటలకి అందరూ విస్తుపోయేరు.

"బాబూ" అంది శకుంతలమ్మ ఏడుస్తూ.

"నిన్ను నొప్పిస్తే నన్ను క్షమించమ్మా. మన దొడ్లో పాక వేసుకొని బతుకుతున్న ఎంకటేశు భార్యని నాన్న బలవంతం చేసి అక్రమ సంబంధం పెట్టుకుంటే రాజు పుట్టేడని, వాడిలో నాన్న పోలికలు గమనించి ఎంకటేశు పెళ్ళాన్ని కొడితే అది ఉరి పోసుకు చచ్చిందన్న నిజం ప్రపంచానికి తెలిక పోయినా నాకు-నీకు తెలుసు." అన్నాడు విద్యాసాగర్.

ధర్మరాజు ముహం తెల్లగా పాలిపోయింది.

"అరేయ్. తండ్రిని అంత మాట అనొచ్చా?" భావరాజు ముందుకొచ్చి మందలించబోయేడు.

"మీరందరూ కలిసి చెప్పే నీతి ఏమిటో నాకు తెలుసు భావరాజు గారూ తప్పు చెయ్యొచ్చుకాని- దాన్ని బయటకి ఒప్పుకోకూడదు. మీరందరూ నిజంగా మనసా వాచా పెద్ద మనుషులయితే వాడ వాడకి వేశ్యల గృహాలు ఎందుకు వెలుస్తాయి.? ఊరు ఊరుకి అనాధాశ్రమాలెందుకు పుట్టుకువస్తాయి. భయపడో, యిఅశక్తులయ్యో, ఆర్థిక దుస్థితికి లొంగిపోయో మీకు సుఖాన్నిచ్చిన స్త్రీలు నుయ్యో గొయ్యో చూసుకుంటే మీరు ఆవిడ బరితెగించిన తనాన్ని తిడుతూ శవ పంచాయితీ జరిపిస్తారు. ఏ చెత్తకుండీలలోనో మీ సంతానం కనిపిస్తే అలా పారేసిన ఆడదాన్ని శాపాలు పెడ్తూ తప్పుకొని వెళ్తారు. నాకలాంటి రాక్షస హృదయం లేదు. నేను తప్పు చేసేను. తెలిసి తెలిసి నా బిడ్డని అనాధగానో, పాలేరుగానో చూడగల ఖర్మ నాకు లేదు. వస్తాను" విద్యాసాగర్ చర చరా నడిచి గేటు దాటుతుంటే అవాక్కయి నిలబడి పోయ్యేరు.

"ఆగండి"

విద్యాసాగర్ నిలబడి వెనక్కి తిరిగి చూశాడు.

నర్మద పరిగెత్తుకొచ్చి అతని చెయ్యి పట్టుకొంది.

ఆ ఇద్దరూ బయటకొస్తుంటే రాజు ఎదురొచ్చి "పట్నం ఎళ్ళిపోతన్నారా బాబూ." అన్నాడు అమాయకంగా.

నర్మద వాడికేసి తేరిపార చూసింది.

వాడిలో స్పష్టంగా మామగారి పోలికలు!

ఆమె కళ్ళలో నీళ్ళూరేయి!

ఒకే తండ్రి బిడ్డల్లో ఒకడు కలెక్టరు- మరొకడు గొడ్లకాపరి!

ఈ అన్యాయానికి ఎవరు బాధ్యులు?

ఆమె కలుక్కుమన్న హృదయంతో అతని వెంట నడిచింది భర్త చేతిలోని బిడ్డని అందుకొని.

భర్త రూపానికే కాక గుణానికి కూడా ఒక మనిషిలా కన్పించేడామె కళ్ళకి. ●